తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

29-07-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 171

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


## అధికారంలోకి వస్తే హైడ్రాను రద్దు చేస్తాం



- సిరిసిల్లను అపారెల్ హబ్‌గా తీర్చిదిద్దాలి: కేటీఆర్
- హైడ్రాపై హైకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావించిన కేటీఆర్
- సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్ అభివృద్ధికి కేంద్రానికి విజ్ఞప్తి
- కాజీపేట రైల్వే డివిజన్, కొత్త రైల్వే ప్రాజెక్టులపై డిమాండ్
- డీలిమిటేషన్, నీట్, నిషేధిత భూములపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు

3

## హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం



- ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది
- కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం
- హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు
- కావాలనే సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూలై 28, సిరి న్యూస్:**

హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట, బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా..పెద్దలా అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా.. పెద్దలదా.. అని వారిని నిలదీశారు.హైడ్రా తాము

మిగతా 3వ పేజీలో..



### లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

- చర్యలు లేనందునే గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకి విస్తరణ
- కేసీఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

# కాసుల కోసం అంచనా కోటి తగ్గింది!



- యజమాని నజరానా అరకోటి అధికారికి దక్కింది
- తలా కొంత పంచుకుతిన్న ట్రాన్స్ కో తోడు దొంగలు
- ఉత్తర్వులు బేఖాతరు.. ఇచ్చే కాసుల ఆధారంగానే మంజూరు
- విద్యుత్ శాఖకు కోట్లలో నష్టం!
- ఇస్నాపూర్ విద్యుత్ సబ్-డివిజనల్ అధికారి మాయాజాలం
- ముందు కోటి 40 లక్షలు.. దరఖాస్తుదారుడు రాగానే 27 లక్షలకు కుదింపు
- ఏకంగా రూ. 1.10 కోట్ల లబ్ధి చేకూర్చేలా నిబంధనలకు తిలోదకాలు
- కార్పొరేట్ అనుమతి లేకుండానే ఇన్ అండ్ అవుట్ ప్రతిపాదనల డ్రామా
- ఫోర్ పోల్ స్ట్రక్చర్, భూమి విలువ మాయం.. ప్రైవేటు కంపెనీకి పహారా
- డీఈఈ, ఎస్ఈ, సీఈల ఉదాసీనత.. కళ్లు మూసుకుని మంజూరు
- ఏడీఈ పర్యవేక్షణలో లెక్కలేనన్ని తప్పుడు అంచనాలు..
- అన్నిటికి వత్తాసు పలికిన ఇంచార్జి డీఈఈ లక్ష్మణ్
- సీఎండీ విచారణ చేస్తే ఇంటి దొంగలు బయటకు
- 'సిరి న్యూస్' నిఘాలో ట్రాన్స్ కో మాయగాళ్ల బండారం
- రేపటి సంచికలో మరో సంచలనాత్మక కథనం...




**నిఘా విభాగం, సిరి న్యూస్:**

ఇక్కడ ఇచ్చే డబ్బుల ఆధారంగానే అంచనాలు చేయబడతాయి.. వాస్తవానికి భిన్నంగా ఉన్నా, నిబంధనలకు విరుద్ధమైనా సరే తప్పక మంజూరి కావింపబడతాయి.. సంస్థకు కోట్లు కొల్లగొట్టి మరీ సొంతానికి సగం ఇస్తే ఎంతటి పనైనా వెంటనే జరుగుతుంది. ఇస్నాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో ఏడీఈ ఆధ్వర్యంలో ఎలాంటి పనైనా కేవలం ఇచ్చే కాసుల ఆధారంగా చక్కబడుతుందట. ఒకవేళ లెక్క కుదరకపోతే అన్ని అర్హతలు ఉన్నా తిరస్కరణ తప్పదు. ఉన్నతాధికారుల ఆదేశాలు, కంపెనీ నిబంధనలను సైతం అతిక్రమించి పారిశ్రామికవేత్తలకు పహారా కాస్తున్న విద్యుత్ అధికారుల పని తీరుపై 'సిరి న్యూస్' ప్రత్యేక నిఘా పెట్టింది. ఈ నిఘాలో విద్యుత్ శాఖకు కోట్లాది రూపాయల ఆర్థిక నష్టాన్ని కలిగించిన ఎన్నో అక్రమ అంచనాలు బయటపడ్డాయి. కేవలం అంచనాలు తగ్గించడానికి ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి మాతృ సంస్థకే ద్రోహం చేసేందుకు ఒక ఏడీఈ వేసిన

మిగతా 3వ పేజీలో..



### ఏసీబీ చరిత్రలో సరికొత్త రికార్డు

- 1983 తర్వాత ఒక్క త్రైమాసికంలోనే అత్యధిక అవినీతి కేసుల నమోదు
- రెండో త్రైమాసిక పనితీరుపై డీజీ చారు సిన్హా సమీక్ష
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు
- అవినీతిపై మరింత కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచన

3



### గడువులోగా భూముల రీసర్వే పూర్తి చేయాలి

- ప్రజల అవగాహన కోసం గ్రామ సభలు నిర్వహించాలి
- రీ సర్వేకు కలెక్టర్లు ప్రాధాన్యమివ్వాలి
- భూ వివాదాల పరిష్కారానికి రీ-సర్వే కీలకం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

2



### భవిష్యత్తులో పేపర్ లీకులకు అడ్డుకట్ట

- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు, రూ.10 కోట్ల జరిమానా
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

3



### సైబర్ మోసాలకు చెక్.. కేంద్రం కీలక నిర్ణయం

- 'ఇండియా డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్' ఏర్పాటు
- ఆన్‌లైన్ ఆర్థిక మోసాల నివారణకు కొత్త వ్యవస్థ
- ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో రియల్ టైమ్ హెచ్చరికలు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

2




## తుది దశకు చేరుకుంటున్న సర్

- డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆలస్యం

**హైదరాబాద్, జూలై 28, సిరి న్యూస్ :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ('సర్') గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి చిరునామాలను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. అధికారులు, సిబ్బంది సహా అందరూ ఎన్యూమరేషన్ పత్రాల

మిగతా 2వ పేజీలో..

## పీజీ చదువుకొని ఫేక్ యాప్ బారిన పడ్డ నిరుద్యోగి!

- స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో రూ.72.69 లక్షలు స్వాహా
- యూట్యూబ్‌లో ప్రకటన చూసి నకిలీ అప్ స్టాక్' యాప్‌లో పెట్టుబడులు
- మోసపోయిన తూప్రాన్ వాసి విఠలాచారి
- డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా మోసం వెలుగులోకి..

2





## హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

- కోట్ల రూపాయల సైబర్ మోసం
- కీలక నిందితుడు వికాస్ అరెస్ట్

**హైదరాబాద్, జూలై 28 , సిరి న్యూస్:**

హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా

మిగతా 2వ పేజీలో..

# పీజీ చదువుకొని ఫేక్ యాప్ బారిన పడ్డ నిరుద్యోగి!

**తూప్రాన్, జూలై 28 (సిరి న్యూస్):**



ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ఓ నిరుద్యోగి ఆశలను ఆసరాగా చేసుకుని సైబర్ కేటుగాళ్లు భారీ మోసానికి పాల్పడ్డారు. యూట్యూబ్‌లో వచ్చిన నకిలీ ప్రకటనను నమ్మి స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ఏకంగా రూ.72,69,973 లక్షలు కోల్పోయిన ఘటన తూప్రాన్ పట్టణంలో కలకలం రేపింది. ఈ మోసానికి సంబంధించి బాధితుడు మంగళవారం తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తూప్రాన్ పట్టణానికి చెందిన శ్రీ కమ్మరి విఠలాచారి పీజీ పూర్తి చేశారు. గతేడాది జూన్ 19న యూట్యూబ్‌లో స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనను ఆయన చూశారు. ఆ ప్రకటనలో ఉన్న ఎన్ 114 ఈ లైట్ చాట్ హబ్ అనే వాట్సాప్ గ్రూపులో ఆయన చేరారు. ఆ గ్రూపులోని నిందితులు తమను స్టాక్ మార్కెట్ నిపుణులుగా పరిచయం చేసుకుని, బాధితుడిని నమ్మించారు. అసలైన అప్ స్టాక్ యాప్ పేరుతో ఒక నకిలీ ట్రేడింగ్ యాప్‌ను ఆయన చేత డౌన్‌లోడ్ చేయించారు. ఆ నకిలీ యాప్‌లో భారీగా లాభాలు వస్తున్నట్లు చూపించడంతో విఠలాచారి వాటిని నిజమని నమ్మాడు. నిందితులు సూచించిన వివిధ బ్యాంకు ఖాతాలకు విడతల వారీగా రూ.72,69,973 బదిలీ చేశాడు. అయితే తాను పెట్టిన పెట్టుబడి మొత్తాన్ని, వచ్చిన లాభాలను విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా.. మరిన్ని నగదు చెల్లించాలని నిందితులు డిమాండ్ చేశారు. ఎంతకీ డబ్బులు వెనక్కి ఇవ్వకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు గమనించారు. దీనిపై జూలై 25న ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో (నెం. 33707260035876) ఫిర్యాదు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తూప్రాన్ ఎస్ఐ 2 యాదగిరి తెలిపారు.

**ప్రజలకు తూప్రాన్ పోలీసుల హెచ్చరిక..**

సోషల్ మీడియా, యూట్యూబ్, టెలిగ్రామ్ లేదా వాట్సాప్ గ్రూపుల ద్వారా వచ్చే అధిక లాభాల హామీలను ఎవరూ నమ్మవద్దని పోలీసులు హెచ్చరించారు. గుర్తింపు లేని ట్రేడింగ్ యాప్‌లు లేదా పెట్టుబడి ప్లాట్‌ఫారమ్‌లలో పెట్టుబడులు పెట్టే ముందు వాటి విశ్వసనీయతను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. తక్కువ సమయంలో భారీ ఆదాయం వస్తుందని చెప్పే ప్రకటనలన్నీ మోసపూరితమైనవేనని స్పష్టం చేశారు. ఎవరైనా ఇటువంటి ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసి సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. అప్రమత్తంగా ఉండి మీ కష్టార్జితాన్ని కాపాడుకోవాలని తూప్రాన్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

**మొదటిపేజీ తరువాయి**

మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖపట్నం, లఖ్‌నవూతో పాటు పలు నగరాల్లో నకిలీ కాల్ సెంటర్లను వికాస్ నిర్వహించాడు. ఈ ముఠా టెక్నికల్ సపోర్ట్ పేరుతో విదేశీయులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బు కాజేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ ప్రైవేట్ కంపెనీల అధికారులమంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వికాస్ కంప్యూటర్ వైరస్‌లు, బ్యాంకు ఖాతా సమస్యలు, సెక్యూరిటీ అలర్ట్‌ల పేరుతో అమెరికన్లను భయపెట్టి డబ్బు వసూలు చేశాడని, గిఫ్ట్ కార్డులు, డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ బాధితుల నుంచి నగదు సేకరించినట్లు దర్యాప్తులో తేలింది. ఆ డబ్బును క్రిప్టో కరెన్సీగా మార్చి ఆధారాలు లేకుండా ప్రయత్నించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. క్రిప్టో ఆస్తులను ఎక్స్ఛేంజిలు, హవాలా తరహా నగదు సెటిల్‌మెంట్ నెట్‌వర్క్‌లు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా భారత కరెన్సీగా మార్చినట్లు విచారణలో బయటపడింది. వీసీ సొల్యూషన్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి మోసపూరిత డబ్బును చట్టబద్ధ ఆదాయంగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీసీ సొల్యూషన్స్ బ్యాంకు ఖాతాల్లో భారీ నగదు డిపాజిట్లు, అనుమానాస్పద క్రెడిట్ లావాదేవీలను గుర్తించారు. కాల్ సెంటర్ ద్వారానే ఆదాయం వచ్చినట్లు విచారణలో నిమార్ అంగీకరించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అయితే ఈ డబ్బును ఆదాయపు పన్ను రిటర్న్స్‌లో కిరాణా వ్యాపారం, ఇతర వ్యాపారాల ఆదాయంగా వికాస్ చూపించాడని తెలిపారు. ఈ కేసులో మరికొందరి పాత్ర, నిధుల ప్రవాహం, క్రిప్టో లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# భవిష్యత్తులో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**న్యూఢిల్లీ, జూలై 28, సిరి న్యూస్:**

భవిష్యత్తులో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి.. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి.. అయితే అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి అని అన్నారు. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయన్నారు. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం.. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం.. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం.. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం.. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

**ఢిల్లీ, జూలై 28, సిరి న్యూస్ :**



ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని విమర్శించారు. ఈ విషయంలో దేశస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరగాల్సి ఉందని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేది ఆలోచిస్తామని సీఎం ఒక ప్రశ్నకు బదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని చెప్పారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గ్లోబరీనా వటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించి వాటిని గందరగోళం చేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్ల బకాయిలు పెట్టిపోయిందంటూ ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, తమ ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీ వంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఏపీలో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, కృష్ణయ్యలకు సూచిస్తున్నామన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని, భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంకు ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఏటా రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయన్నారు. క్రమం తప్పకుండా వాటిని చెల్లించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పార్క్‌లను కబ్జాలు పెట్టుకున్నోళ్లు కోర్టులను తప్పుదోవ పట్టించి కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద అధికారులను మార్చాలనే నిబంధన ఉంటే, గతంలో సోమేశ్‌కుమార్ మీద 400 కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులున్నాయని, అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు.

**సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం**

అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్‌క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్1ను విజయవంతంగా ప్రయోగించిన తీరును వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధనఅభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారు సాధించిన విజయం దేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని ప్రశంసించారు.

# సైబర్ మోసాలకు చెక్.. కేంద్రం కీలక నిర్ణయం

- **'ఇండియా డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్' ఏర్పాటు**
- **ఆన్‌లైన్ ఆర్థిక మోసాల నివారణకు కొత్త వ్యవస్థ**
- **ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో రియల్ టైమ్ హెచ్చరికలు**
- **బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు తక్షణ అలర్ట్‌లు**
- **రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

**న్యూఢిల్లీ, జూలై 28, సిరి న్యూస్:**



దేశంలో పెరుగుతున్న సైబర్ ఆర్థిక నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ మోసాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు *'ఇండియా డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్' (ఐడీపీఐసీ)*ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆమె లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

**ఏఐతో రియల్ టైమ్ నిఘా**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి ఐడీపీఐసీ పనిచేస్తుందని మంత్రి వివరించారు. ఆర్థిక నేరాలకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం విశ్లేషిస్తూ, అనుమానాస్పద లావాదేవీలు లేదా సైబర్ బెదిరింపులు గుర్తించిన వెంటనే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు రియల్ టైమ్ అలర్ట్‌లు జారీ చేస్తుందని తెలిపారు.

**భద్రతకు పలు వ్యవస్థలు**

ఆర్థిక రంగంలో సైబర్ భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు వ్యవస్థలను అమలు చేస్తోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆధ్వర్యంలోని నేషనల్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ మెటాడేటా ఆధారంగా సైబర్ బెదిరింపులను ముందుగానే గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తోందన్నారు.

**సమన్వయంతో సైబర్ భద్రత**

ఫైనాన్షియల్ రంగం కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న సీఎస్ఐఆర్‌టీఫిన్ సైబర్ దాడుల సమాచారాన్ని సేకరించి బ్యాంకింగ్ రంగానికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తోందని తెలిపారు. అలాగే ఆర్థిక నియంత్రణ సంస్థల మధ్య సమన్వయం కోసం ఇంటర్‌రెగ్యులేటరీ టెక్నికల్ గ్రూప్, కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలతో కూడిన ఐబీఏ వర్కింగ్ గ్రూప్ కూడా నిరంతరం పనిచేస్తున్నాయని ఆర్థిక మంత్రి వెల్లడించారు.

# తుది దశకు చేరుకుంటున్న 'సర్'

**మొదటిపేజీ తరువాయి**



స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు. గతంతో పోలిస్తే కొంత పరిస్థితి మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వాల్సిన వారు అధికంగానే ఉండటం గమనార్హం. వాటి అందజేతకు కొందరు నిరాకరిస్తుండగా మరికొందరు అందుబాటులో లేకపోవడంతో డిజిటలైజేషన్ ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. చిరునామాలు మారిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి సమాచారం అందించి ఎన్యూమరేషన్ పత్రం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. 'సర్' ప్రక్రియ ఆగస్టు 3న ముగుస్తుంది. కేవలం ఆరు రోజులే మిగిలి ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో లక్షకు పైగా ఓటర్ల ఎన్యూమరేషన్ పత్రాలు తీసుకొని డిజిటలైజేషన్ చేయడం కష్టసాధ్యమనే చెప్పాలి. అందిన ఎన్యూమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మరంగా కసరత్తు కొనసాగుతున్నది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీకి చెందిన వారు ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తమ స్వస్థలాల్లో ఓటు హక్కు ఉండేలా అక్కడే పత్రాలను ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇలాంటి వారి నుంచి ఆయా ప్రాంతాల్లో ఓటరు నంబరు తీసుకుని ఆ సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వీరందరికీ ఎన్యూమరేషన్ పత్రాలను జూన్ 25న ప్రారంభించారు.

# గడువులోగా భూముల రీ-సర్వే పూర్తి చేయాలి

**హైదరాబాద్, జూలై 28, సిరి న్యూస్:**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీ సర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీసర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీసర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీసర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికతతో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు. రీసర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రీసర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని, ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామ కంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చేందేలా సర్వే చేపట్టాలని, ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# అధికారంలోకి వస్తే హైడ్రాను రద్దు చేస్తాం

**ఢిల్లీ, జూలై 28 , సిరి న్యూస్:**

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే హైడ్రా సంస్థను రద్దు చేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. హైడ్రాపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తాయని పేర్కొన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర అభివృద్ధి, రైల్వే, ఐటీ, డీలిమిటేషన్, నీట్ పరీక్షల సంస్కరణలు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.

**సిరిసిల్లను టెక్స్‌టైల్, అపారెల్ హబ్‌గా అభివృద్ధి చేయాలి**

సిరిసిల్లను తమిళనాడులోని తిరుప్పూర్ తరహా టెక్స్‌టైల్, అపారెల్ హబ్‌గా తీర్చిదిద్దే సామర్థ్యం ఉందని కేటీఆర్ అన్నారు. తంగళ్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి మిడ్‌మానేర్ రిజర్వాయర్ మీదుగా రైల్‌కమ్‌రోడ్ బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరినట్లు తెలిపారు. హైదరాబాద్-వరంగల్ రైల్వే మార్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాలని కూడా విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

**టైర్-2 నగరాల్లో ఐటీ, ఏఐ విస్తరణ**

కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ వంటి నగరాల్లో ఐటీ రంగాన్ని మరింత విస్తరించేందుకు కేంద్రం సహకరించాలని కోరినట్లు కేటీఆర్ తెలిపారు. వరంగల్‌లో ఇండియా ఏఐ సెంటర్, ఇండియా ఏఐ డేటా ల్యాబ్ ఏర్పాటు చేయాలని, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. ఎస్‌టీపీఐ ఆధ్వర్యంలో సెమీకండక్టర్ డిజైన్, డీప్‌టెక్, స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించే ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కూడా కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

**కాజీపేట రైల్వే డివిజన్‌తో పాటు కొత్త రైల్వే లైన్లకు విజ్ఞప్తి**

సౌత్ సెంట్రల్ రైల్వే పునర్వ్యవస్థీకరణలో భాగంగా కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు కేటీఆర్ వెల్లడించారు. అలాగే మనోహరాబాద్-సిద్దిపేట-సిరిసిల్ల-వేములవాడ-కొత్తపల్లి బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమవుతోందని ఆరోపించారు.

**హైడ్రాపై మరోసారి విమర్శలు**

హైడ్రా తొమ్మిది తలల విషసర్పంలా మారిందని హైకోర్టు వ్యాఖ్యానించిందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే సమయానికి రాష్ట్రంలో నిషేధిత భూముల విస్తీర్ణం 16 లక్షల ఎకరాలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అది కోటి ఎకరాలకు చేరిందని ఆరోపించారు. సామాన్యుల ఇళ్లపైనే చర్యలు తీసుకుంటూ, అధికార పార్టీ నేతలకు చెందిన నిర్మాణాలను వదిలేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే హైకోర్టు సూచనలకు అనుగుణంగా హైడ్రా సంస్థను రద్దు చేస్తామని మరోసారి స్పష్టం చేశారు.

**నీట్, డీలిమిటేషన్‌పై కేంద్రాన్ని ప్రశ్నించిన కేటీఆర్**

నీట్ పరీక్షల వివాదం యువతలో ఇప్పటికే పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతీక మాత్రమేనని కేటీఆర్ అన్నారు. పరీక్షల సంస్కరణలకు సంబంధించిన బిల్లులను మంచి ఉద్దేశంతో తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఉమ్మడి వైఖరి అవలంబించాలని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ తగిన నిర్ణయం తీసుకుంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఏసీబీ చరిత్రలో సరికొత్త రికార్డు

**హైదరాబాద్, జూలై 28, సిరి న్యూస్:**

అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) 2026 రెండో త్రైమాసికంలో చారిత్రక రికార్డు నమోదు చేసింది. 1983లో ఏసీబీ ఏర్పాటైన తర్వాత ఒకే త్రైమాసికంలో అత్యధిక అవినీతి కేసులు నమోదు కావడం ఇదే తొలిసారని ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా తెలిపారు.

మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏప్రిల్-జూన్ 2026 కాలంలో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతిని ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఏసీబీ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ఈ ఘనత సంస్థ అవినీతిపై అవలంబిస్తున్న కఠిన వైఖరి, నిరంతర అప్రమత్తత, అధికారుల వృత్తి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**ఉత్తమ అధికారులకు సత్కారం**

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఏసీబీ అధికారులు, సిబ్బంది కృషిని చారు సిన్హా అభినందించారు. పారదర్శక పాలన, సమిష్టి పనితీరు, వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించిన అధికారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా 'రివార్డ్ మేళా' నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

**ప్రజల విశ్వాసమే లక్ష్యం**

అవినీతి దేశాన్ని లోపల నుంచే బలహీనపరుస్తుందని పేర్కొన్న చారు సిన్హా, అధికారులు నిజాయితీ, నిష్పాక్షికతతో విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు. చట్టపాలనను మరింత బలోపేతం చేయడంలో ఏసీబీ కీలక పాత్ర పోషించాలని అన్నారు.

**దర్యాప్తు ప్రమాణాల మరింత బలోపేతం**

ఏసీబీ ఎల్లప్పుడూ వృత్తిపరమైన, నిష్పాక్షిక, సమగ్ర దర్యాప్తుకే ప్రాధాన్యం ఇస్తుందని చారు సిన్హా స్పష్టం చేశారు. నిరంతర శిక్షణ, దర్యాప్తు ప్రమాణాల మెరుగుదల, సంస్థాగత అప్రమత్తత ద్వారా అవినీతి నిరోధక చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. నిజాయితీ, జవాబుదారీతనం, సుపరిపాలన పరిరక్షణలో ఏసీబీ ముందంజలో కొనసాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# హైడ్రా తీరుపై మరోసారి హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, జూలై 28, సిరి న్యూస్:**

హైడ్రా వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రెండు వేర్వేరు భూ వివాదాలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్టులోని రెండు ధర్మాసనాలు హైడ్రా చర్యలను తప్పుబట్టాయి. అధికారుల నిర్లక్ష్యం, సరైన ధ్రువీకరణ లేకుండా చేపడుతున్న చర్యలపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

**సాహెబ్‌నగర్‌లో బోర్డు తొలగించాలి**

హయత్‌నగర్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డుపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ బోర్డును 24 గంటల్లో తొలగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**కొండాపూర్ కేసులో తహసీల్దార్‌కు నోటీసు**

కొండాపూర్‌లోని మరో ప్రైవేట్ స్థలానికి సంబంధించిన కేసులో హైడ్రా అనవసరంగా జోక్యం చేసుకుందని కోర్టు పేర్కొంది. సరైన విచారణ లేకుండానే తప్పుడు సమాచారం అందించిన సంబంధిత తహసీల్దార్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది.

# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణపై తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ డియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన విషయం తెలిసిందే. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి**
**– స్థానిక అవసరాలకు తగినట్లు వీబీ జీ రామ్ జీలో పనులు చేర్చండి**

ప్రధానమంత్రి ఆవాస్ యోజనగ్రామీణ్ కింద రాష్ట్రానికి 11,56,915 ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కృషి భవన్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం పీఎంఏవైజీ ను వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గత పదేళ్లు పేదలు సొంత ఇళ్లు నిర్మించుకోకపోవడంతో, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు సీఎం తెలిపారు.



# ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం

- **'ప్రజావాణి'ని పరిశీలించిన మంత్రి పొన్నం**

**హైదరాబాద్, జూలై 28, సిరి న్యూస్ :**

ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2బీహెచ్‌కే గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి రోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యల ను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణిలో వచ్చిన ప్రతీ వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం తెలిపారు.

# కాసుల కోసం అంచనా 'కోటి' తగ్గింది!

**మొదటిపేజీ తరువాయి**




పక్కా ప్రణాళికకు సంబంధించిన ప్రత్యేక కథనమిది!

**పాశమైలారంలో 'వాలెంటిస్ లాబొరేటరీస్' దరఖాస్తు కథేంటి?**

విద్యుత్ శాఖలో సంగారెడ్డి సర్కిల్ పరిధిలోని ఇస్నాపూర్ సబ్ డివిజన్ అత్యంత ఆదాయం కలిగిన పారిశ్రామిక ప్రాంతం ఉన్న ఆపరేషన్ సబ్ డివిజన్. ఇక్కడ దరఖాస్తుదారుడు ఇచ్చే బరువు (కాసులు) ఆధారంగా అంచనా బరువు నిర్ణయింపబడుతుంది. ఎక్కువ బరువుంటే తక్కువ అంచనా.. తక్కువ బరువుంటే ఎక్కువ అంచనా అన్నమాట! ఇలా ఒక పారిశ్రామికవేత్త తనకు 11 కేవీ నుండి మార్చి అదనంగా లోడ్ ఇస్తూ 33 కేవీ లైన్ ఇవ్వాలని ఇచ్చిన దరఖాస్తు ఇక్కడి అధికారులకు కాసులు కురిపించింది. సంగారెడ్డి డివిజన్ పరిధిలోని ఇస్నాపూర్ సబ్ డివిజన్‌లో ఉన్న పాశమైలారంలో 'వాలెంటిస్ లాబొరేటరీస్' అనే సంస్థ ఉంది. ఆ సంస్థకు సర్వీస్ కనెక్షన్ నంబర్ ఎస్ఆర్ జీ 756తో 11 కేవీ లైన్ ద్వారా 1200 కేవీఏ సామర్థ్యానికి విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే అదనంగా 301 కేవీఏ లోడ్ కోసం ప్రత్యేకంగా 33 కేవీ లైన్ కావాలని సదరు కంపెనీ యజమాని హెచ్ టీ 56455137 నంబరుతో దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం 132 కేవీ పాశమైలారం నుండి వచ్చే 33 కేవీ ఫీడర్ ఈపీఐపీ3 ఫీడర్ ట్యాపింగ్ చేయడానికి టీజీట్రాన్స్కో సాంకేతిక అనుమతిని సైతం జతకూర్చారు.

**మొదటగా అంచనా రూ. 1.40 కోట్లు!**

దరఖాస్తు మాత్రమే రావడం, దరఖాస్తుదారుడు అధికారులను నేరుగా కలవకపోవడంతో వచ్చిన దరఖాస్తుకు గడువులోగా అంచనాలు రూపొందించారు. ఇందుకోసం ట్రాన్స్కో ప్రతిపాదించిన ఈపీఐపీ3 ఫీడర్‌కు అధిక లోడ్ ఉందని, దానిని ఈపీఐపీ1 ఫీడర్ నుండి ట్యాపింగ్ చేస్తూ ఇన్ అండ్ అవుట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు తయారు చేశారు. 03.09.2025న ఈ అంచనాలు సిద్ధం చేసి పంపారు. ఇక్కడ అదనపు లోడ్ హెచ్‌టీ సర్వీసుకు సంబంధించినది కాబట్టి, ఏడీఈ పర్యవేక్షణలోనే ఏకంగా రూ. 1,40,24,705 (కోటి నలభై లక్షల ఇరవై నాలుగు వేల ఏడువందల ఐదు రూపాయలు) కు అంచనాలు వేస్తూ సంగారెడ్డి డివిజనల్ అధికారికి పంపారు.

**అక్కడినుండి ఎస్ఈ కార్యాలయానికి సవరణలు లేకుండానే..**

సహజంగా ఏదైనా అంచనా పైఅధికారుల వద్దకు వస్తే, అందులో ఉన్న సాంకేతిక లోపాలను సరిచేయాలని రిమార్క్ రాసి కిందకి తిప్పి పంపుతారు. కానీ అప్పటి డివిజనల్ ఇంజనీర్ మాత్రం వచ్చిన అంచనాను అలాగే కౌంటర్ సైన్ చేసి పైఅధికారి అయిన సూపరింటెండెంట్ ఇంజనీర్ కి పంపేశారు.

**కార్పొరేట్ అనుమతి లేకుండానే..**

సహజంగా 33 కేవీఏ లైన్ ట్యాపింగ్ సందర్భంగా ఇన్ అండ్ అవుట్ ఏర్పాటు అంచనాల్లో ఉంటే, అందుకు కార్పొరేట్ కార్యాలయం నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా చేయకుండానే ఇక్కడ ఇన్ అండ్ అవుట్ అంచనాలు రూపొందించడం కేవలం కాసుల కోసం వేసిన పన్నాగంలా అనిపిస్తోంది. ఇలా తన అధికారాన్ని ఇష్టారీతిగా వాడుకుంటూ ఏడీఈ ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు.

**వెనక్కి వచ్చిన ఫైల్..**
**ఒక్కసారిగా మారిన అంచనాలు..**

కోటి నలభై లక్షలతో 1.2 కిలోమీటర్ల లైన్ ద్వారా ట్యాపింగ్ అంచనా ఫైల్ 15 రోజుల వ్యవధిలోనే ఏడీఈకి తిరిగొచ్చింది. డిస్పాచ్ నంబర్ 2388/25 ద్వారా 24.09.2025 రోజున ఈ మొదటి అంచనాను సంగారెడ్డి ఇంచార్జ్ డీఈఈ లక్ష్మణ్ ఇస్నాపూర్ ఏడీఈకి తిప్పి పంపారు. డీఈఈ కార్యాలయం నుండి ఫైల్ వెనక్కి రాగానే బేరాలు కుదిరి, అంచనాల్లో సమూల మార్పులు జరిగాయి! అప్పటివరకు అధిక లోడ్ ఉందని చెప్పిన ఈపీఐపీ3 ఫీడర్ గుండానే ట్యాపింగ్ చేసేలా కేవలం 200 మీటర్ల దూరంతో కొత్త అంచనా రూపొందించారు. అలా కోటి 40 లక్షలకు పైగా ఉన్న అంచనా కాస్తా ఒక్కసారిగా రూ. 27,59,722 (ఇరవై ఏడు లక్షల యాభై తొమ్మిది వేల ఏడువందల ఇరవై రెండు రూపాయలు) కు తగ్గింది. ఇందులో నిబంధనలను అసలే పాటించకుండా దరఖాస్తుదారునికి ఏకంగా రూ. 1,10,00,000 (కోటి పది లక్షల) లబ్ధి చేకూర్చారు.

**ఫోర్ పోల్ స్ట్రక్చర్ కూడా అంచనాల్లో లేదు?**

నిబంధనల ప్రకారం 33 కేవీఏ ట్యాపింగ్ అంచనాల్లో ఫోర్ పోల్ స్ట్రక్చర్ ఉండాల్సిందే. దానికి సంబంధించిన భూమి విలువ రూ. 12,50,000 ను అంచనాల్లో పొందుపరచలేదు. అలాగే ముందు ప్రతిపాదించిన ఇన్ అండ్ అవుట్ ను కూడా ఎత్తివేశారు. ఇలా విద్యుత్ శాఖకు ఎంత నష్టం చేయగలరో అంత చేసి, లబ్ధిదారునికి కావాల్సినంత న్యాయం చేయగలిగారు.

**అప్పుడు ఎందుకలా? ఇప్పుడు ఎందుకిలా?**

వాలెంటిస్ లాబొరేటరీస్ సంస్థ అదనపు లోడ్ కోసం, 33 కేవీఏ ట్యాపింగ్ కోసం దరఖాస్తు చేయగానే కోటి నలభై లక్షల పైచిలుకు అంచనా ఎందుకు వేశారు? మళ్ళీ ఏడీఈ పర్యవేక్షణలోనే ఆ అంచనా ఒక్కసారిగా కోటి పది లక్షలకు పైగా తగ్గడం ఇక్కడ ఎన్నో అనుమానాలకు దారితీస్తోంది. టర్న్ కీ పద్ధతిన చేసిన పనులలో అంచనా వ్యయం తగ్గడం వల్ల ఏకంగా రూ. 35 లక్షల ప్రయోజనం సదరు వినియోగదారునికి దక్కింది.

**ఏ అంచనా అయినా సరే పై అధికారులు మంజూరు కోసం..**

అదనపు లోడ్ అంచనా రెండవసారి రూ. 27 లక్షల పైచిలుకు రాగా, దానిని అప్పటి డీఈఈ అలాగే ఎస్ఈకి పంపారు. ఎస్ఈ శ్రీనాథ్ సైతం మంజూరు కోసం సీఈ కామేష్ కుమార్‌కు పంపగా, ఆయన సైతం కళ్ళు మూసుకుని నిబంధనలకు పాతరేసి మంజూరు ఇవ్వడం కొసమెరుపు. ఇది ఇస్నాపూర్‌లో ఒక్క అంచనా మూలంగా విద్యుత్ శాఖకు జరిగిన ఆర్థిక నష్టం కోటి రూపాయలు. ఇలా ఎన్నో అంచనాల్లో స్వలాభం కోసం అక్కడి ఏడీఈ స్వయం పర్యవేక్షణలో లెక్కలేనన్ని తప్పుడు అంచనాలు నమోదయ్యాయి. వీటిపై సీఎండీ విచారణ జరిపిస్తే కోట్లాది రూపాయల ఆర్థిక నష్టానికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కాగా అంచనాలను తలకిందులు చేసి నొక్కేసిన లక్షలు ఇప్పుడు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి..? ఎవరెవరు పంచుకు తిన్నారు..? అనేదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రేపటి సంచికలో 'ఇస్నాపూర్ లో డిజిటల్ లంచాలు.. మాజీ ఉద్యోగి అకౌంట్లోకి లక్షలాది రూపాయలు.

# భూగర్భ జలాలు పెంపొందించడమే లక్ష్యం

- **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**




**ములుగు, జూలై 28, సిరి న్యూస్ :**

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే ముఖ్య లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ములుగు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంతోపాటు జలసిరి అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. 'ఇంటింటికీ ఇంకుడు గుంత ఊరి కోసం ఊటకుంటపంట కోసం పంట కుంట' అనే నినాదంతో ప్రతి గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా విస్తృతంగా పనులు చేపట్టాలని సూచించారు. జలసిరి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ మన ఇంటి సిరిగా భావించి భాగస్వాములు కావాలని కోరారు. పంచాయతీ, మహిళా సంఘాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతుల పొలాల్లో వ్యక్తిగత ఆస్తుల అభివృద్ధి పనులు, పశువుల పాకలు, మిల్క్ షెడ్లు, పంట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులు 'జలసిరి'లో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే నష్టాలను నివారించవచ్చన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జలసిరి పనులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క జలసిరి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తొలుత మల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి కొమురయ్య, ఎంపీడీవో సందీప్, రహీం వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 2వ వార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

### డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలపై మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు కాలనీవాసుల వినతి



**గుమ్మడిదల, జులై 28 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ, పారిశుద్ధ్యంతో పాటు ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరారు. మంగళవారం వార్డు ప్రజలు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ దశరథ్‌ను కలిసి వార్డులో నెలకొన్న సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారి మురుగునీరు ఇళ్ల వద్దకు చేరడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులో పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు, రహదారుల మరమ్మతులు, మురుగు కాలువల శుభ్రత, ఇతర మౌలిక సదుపాయాల కొరత కారణంగా ప్రజలు నిత్య జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రజల వినతిపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్ సంబంధిత అధికారులతో సమస్యలను పరిశీలించి, అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలపై ప్రాధాన్యతతో చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రాం రెడ్డి, సత్యనారాయణ, కాలనీవాసులు రవీందర్ రెడ్డి, పవన్, శంకర్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొని వార్డు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

# ఘణపూర్ లో ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం..

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్



**పటాన్ చెరు, జూలై 28 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముత్తంగి డివిజన్ పరిధి ఘణపూర్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, రేణుక ఎల్లమ్మ తల్లి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ పై పోలీసుల ఉక్కుపాదం

- 11 మందికి జరిమానా.. ఐదుగురికి ఒక రోజు జైలు శిక్ష
- మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు
- ఎస్ ఐ అరుణ్ కుమార్




గుమ్మడిదల, జులై 28 (సిరి న్యూస్): మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై గుమ్మడిదల పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ నెలలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందిని పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. నిందితులను మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరచగా, జిన్నారం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విచారణ చేపట్టి ప్రతి ఒక్కరికి రూ.2,000 చొప్పున జరిమానా విధించారు. అలాగే నిందితుల్లో ఐదుగురికి ఒక రోజు సాధారణ జైలు శిక్షను కూడా విధించినట్లు గుమ్మడిదల ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ చట్టపరమైన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

# భారత వాయుసేనలో చేరి దేశ సేవ చేయండి

### గీతం విద్యార్థులకు ఐఏఎఫ్ పిలుపు

**పటాన్చెరు, జూలై 28 (సిరి న్యూస్):**

భారత వైమానిక దళం (ఐఏఎఫ్)లో అధికారులుగా లేదా అగ్నివీరులుగా చేరి దేశ సేవ చేయాలని భారత వాయుసేనకు చెందిన మాస్టర్ వారెంట్ ఆఫీసర్ దీపక్ భరద్వాజ్ గీతం విద్యార్థులకు పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన 'భారత వైమానిక దళ నియామకం–అభివృద్ధి వాహనం: వృత్తి మార్గదర్శనం' కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఐఏఎఫ్ సహకారంతో గీతం ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయుధ దళాల్లోని కెరీర్ అవకాశాలు, ప్రవేశ అర్హతలు, ఎంపిక విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యూపీఎస్సీ, ఏఎఫ్‌క్యాట్, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీల ద్వారా పర్మనెంట్ కమిషన్ లేదా షార్ట్ సర్వీస్ కమిషన్‌తో వాయుసేనలో చేరే అవకాశాలను దీపక్ భరద్వాజ్ వివరించారు. వాయుసేనలో ఉద్యోగ అవకాశాలు, కెరీర్ పురోగతి, సంక్షేమ సదుపాయాలు, జాతీయ భద్రత, విపత్తు నిర్వహణ, మానవతా సేవల్లో భారత వైమానిక దళం పోషిస్తున్న పాత్రను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన మొబైల్ ఎగ్జిబిషన్ ద్వారా వాయుసేన సామర్థ్యాలను విద్యార్థులకు పరిచయం చేశారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణు కుమార్ నాతి



అతిథులను సత్కరించగా, కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ మహమ్మద్ అక్తర్ ఖాన్ వృత్తి మార్గదర్శక కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్లికార్జున నగర్‌లో గుంతలమయమైన రోడ్ల పరిశీలన..

- త్వరలో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం: మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 28 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్లను మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో కాలనీలో



నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయించామని తెలిపారు. ఆ పనుల అనంతరం రోడ్లు దెబ్బతినడంతో వాటి పునర్నిర్మాణానికి గత వారం అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మరోసారి కాలనీలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించామని, త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, పదవి లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# కబ్జాలు చేస్తే కూల్చివేతలే అక్రమణదారుల గుండెల్లో రైళ్లు

- ప్రతి అంగుళం భూమికి రక్షణ కవచం
- ప్రజా అవసరాలకే ఆ భూములు
- తహసిల్దార్ ఆంథోనీ

**జిన్నారం జులై 28 సిరి న్యూస్**

జిన్నారం మండలం బొల్లారం బీసీ కాలనీ సర్వేనెంబర్ 42 పై కబ్జాదారుల కన్ను రూ. లక్షల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారులు అక్రమంగా, ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు నిర్మాణాలు చేపట్టుతున్నారు. అమాయకులకు వల అక్కుపత్రాలు లేకపోయినా ప్రభుత్వ స్థలమని దాచిపెట్టి, తక్కువ ధరకు వస్తుందని ఆశతో అమాయక ప్రజలకు కొనుగోలుదారులకు విక్రయించి మోసానికి పాల్పడుతున్నారు. రెవిన్యూ యంత్రాంగం నిఘా సర్వే నంబర్ 42 లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బస్మెట్లను గుర్తించి కూల్చివేతలు చేపట్టారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో ఆర్ ఐ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల నివారణకు అవగాహనే ఆయుధం





- పేకాట.. బెట్టింగ్‌పై ఉక్కుపాదం
- సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- వెల్దుర్తి స్టేషన్‌లో అదనపు ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**వెల్దుర్తి, జులై 28, (సిరి న్యూస్):**

ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఐపీఎస్ సూచించారు. మంగళవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, వివిధ రిజిస్టర్లు, కేసు డైరీలు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. ఆయా కేసుల దర్యాప్తు పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ కర్ణాకర్‌రెడ్డికి సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణ, లాకప్ గదులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై స్థానిక శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్షించారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పేకాట, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. నిర్వాహకులతో పాటు వాటిలో పాల్గొనే వారిపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ, దర్యాప్తులో కీలక ప్రయోజనం ఉంటుందని, వాటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని సత్వరమే స్పందించాలని అదనపు ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు.

# జోగిపేట జూనియర్ కళాశాలకు ప్రింటర్ బహుకరణ

**జోగిపేట, జూలై 28, (సిరి న్యూస్ ):**

జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల( కో ఎడ్యుకేషన్ )కు కళాశాలలో తెలుగు అధ్యాపకులు విఠల్ బాల్యమిత్రుడు పి వీ విఠల్ రెడ్డి గారు తన వంతు సహాయంగా సుమారు ఇరవై ఒక్క వెయ్యి రూపాయల విలువగల ప్రింటర్ ను కళాశాలకు అందజేసారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రజిత పి వీ విఠల్ రెడ్డిని అభినందించారు. ప్రతి ఒక్కరికి సేవ చేసే గుణం కలిగి ఉండాలన్నారు. కళాశాలలో ప్రింటింగ్ మిషన్ లేకపోవడం వల్ల చాల ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేర బృందం పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న పోలీసుల ప్రత్యేక నిఘా..





- **నేరాల కట్టడికి పటిష్ట చర్యలు**
- **శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం పర్యవేక్షణ**

**సంగారెడ్డి, జూలై 28 (సిరి న్యూస్): <**

సంగారెడ్డి జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు, నేరాలను పూర్తిగా అణచివేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం దూకుడు పెంచింది. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన రౌడీ మేళా కార్యక్రమం జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై ఉక్కుపాదం మోపేలా పోలీసు శాఖ తీసుకుంటున్న ఈ ముందస్తు చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కేవలం పోలీసుల నిఘానే కాకుండా, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి సమాజంలో జరిగే అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా యువతను పెడదోవ పట్టించే గంజాయి వంటి మహమ్మారిని తరిమికొట్టేందుకు ఏర్పాటు చేసిన ఎస్-న్యాబ్ హెల్ప్‌లైన్ (8712656777) నంబర్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. సత్ప్రవర్తనతో మెలిగే వారికి పూర్తి రక్షణ కల్పిస్తూనే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్‌లు, రౌడీషీట్ల నమోదుతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని పోలీసు శాఖ స్పష్టం చేస్తోంది. జిల్లాలో నేర రహిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలను మునుముందు కూడా మరింత పకడ్బందీగా కొనసాగించనున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావుండొద్దు

- **ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి**
- **సకాలంలో, సమగ్రంగా పరిష్కరించాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, జూలై 27 (సిరి న్యూస్):**



ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదు, వినతిని అత్యంత బాధ్యతతో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సకాలంలో, సమగ్రంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.. అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా జిల్లాకు వచ్చిన దరఖాస్తులతో పాటు, స్థానిక ప్రజావాణిలో అందిన వినతులను కూడా సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. నేటి ప్రజావాణిలో మొత్తం 99 వినతులు అందాయి. ఇందులో సంగారెడ్డి డివిజన్‌కు 14, నారాయణఖేడ్ డివిజన్‌కు 5, జహీరాబాద్ డివిజన్‌కు 39, కలెక్టరేట్‌కు 41 వినతులు అందగా, అందోల్ డివిజన్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, ఉద్యానవన, వ్యవసాయం, పెన్షన్లు, విద్య, సంక్షేమ శాఖలు, పంచాయతీరాజ్, పోలీసు, కార్మిక మరియు పురపాలక శాఖలకు సంబంధించినవిగా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్దుర్తి లో మేలుకొలుపు పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం






**వెల్దుర్తి,జులై 28, (సిరి న్యూస్):**

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తిలో మంగళవారం మెదక్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మేలుకొలుపు పోలీస్ కళాబృందం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. మెదక్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) గ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ హెచ్. సురేందర్, జనార్ధన్, ఇసక్,లతో కూడిన బృందం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుష్పరిణామాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యత, ప్రేమ వ్యవహారాల్లో విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలు, అలాగే సమాజాన్ని ప్రభావితం చేస్తున్న వివిధ సామాజిక రుగ్మతల గురించి కళారూపాలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు చక్కగా వివరించారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య ప్రారంభించి మాట్లాడుతూ, విద్యార్థులు ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా మంచి విలువలను అలవర్చుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మేలుకొలుపు పోలీస్ కళాబృందం అందించిన సందేశాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసు శాఖ చేపడుతున్న ప్రజా చైతన్య కార్యక్రమాన్ని అభినందించారు.

# మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి రెండేళ్ల కఠిన శిక్ష

- **సంగారెడ్డి ప్రత్యేక పోక్సో న్యాయమూర్తి శ్రీలేఖ తీర్పు**
- **ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని అదనపు ఎస్పీ అభినందనలు**

**సంగారెడ్డి, జూలై 28 (సిరి న్యూస్):**

మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ఆమె గౌరవానికి భంగం కలిగించిన నిందితుడికి సంగారెడ్డిలోని ప్రత్యేక పోక్సో (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్) కోర్టు న్యాయమూర్తి శ్రీమతి ఆర్. శ్రీలేఖ రెండేళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ సంచలన తీర్పు వెలువరించారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన ఈ పోక్సో కేసుకు సంబంధించి కోర్టు ఈ తీర్పును ఇస్తూ.. నిందితుడికి శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం.104/2021 కింద ఐపీసీ సెక్షన్లు 376, 511 మరియు పోక్సో చట్టం-2012లోని సెక్షన్ 7, 8 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా నిందితుడు వడ్డె వీరమల్లయ్య (తండ్రి: పాపయ్య, వయస్సు: 57 సంవత్సరాలు, వృత్తి: కూలీ, నివాసం: పల్పనూర్ గ్రామం, హత్నూర మండలం, సంగారెడ్డి జిల్లా) మైనర్ బాలికపై దాడి చేసి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఐపీసీ సెక్షన్ 354 కింద నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పును వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. సుర్‌రెడ్డి, బాధితురాలికి న్యాయ సహాయం అందించిన భరోసా లీగల్ కౌన్సిలర్ శ్రీమతి ఎస్. అపర్ణ మరియు భరోసా టీమ్‌ను అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కేసును దర్యాప్తు చేసిన అప్పటి పటాన్‌చెరు ఎస్ఐ చి. ప్రసాద్‌రావు, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్, కోర్టు డ్యూటీ అధికారి టి. ప్రసన్న లక్ష్మి , ప్రత్యేక పోక్సో కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్ బి. శంకర్, జిల్లా లైజనింగ్ అధికారి కె. సత్య నారాయణల సేవలను ప్రశంసించారు.

# ప్రాజెక్టుకు జలకళ





**పాపన్నపేట్ జూలై 28 సిరి న్యూస్ :**

వర్షాకాల ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ భారీ వర్షాల తో ప్రాజెక్టులు నిండకపోవడంతో రైతన్నలు వర్షాల కోసం ఎదురుచూపులుగా నిలిచాయి, గత రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి మెదక్ జిల్లాలో గల అనేక చెరువులు నిండుకుండలా మారాయి, ఇందులో భాగంగా ముఖ్యమైన వనదుర్గ ప్రాజెక్ట్ (ఘనపూర్ ప్రాజెక్ట్) జలకలతో నిండడం పై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు దిగువ ప్రాంతంలో వరి సాగు చేయని రైతన్నలు, వరి సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాజెక్ట్ నిండడంతో పాటు వేలాది ఎకరాలలో వరి సాగు అవుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వర్ణ దేవుడు కరుణించి మరింత వర్షాలు కురిపించి ఎగువన గల సింగూర్ ప్రాజెక్ట్ నిండాలని అమ్మవారిని కోరుతున్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి.

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**రామాయంపేట, ( నిజాంపేట)జూలై 28 (సిరి న్యూస్)**

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సాధించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. నిజాంపేట్ మండలం చెల్మెడ గ్రామంలోని ఆయిల్ ఫామ్ నర్సరీని హార్టికల్చర్ అధికారి, అగ్రికల్చర్ అధికారి,ఎంపీడీవో తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 2,500 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యం గా పెట్టుకున్నామన్నారు. 2500 ఎకరాల ఆయిల్ ఫామ్ సాగుకోసం పకడ్బందీగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న ఆయిల్ ఫామ్ నర్సరీ లో మలేషియా, థాయిలాండ్, ఇండోనేషియా దేశాలనుంచి విత్తనాలు తెప్పించి, మొక్కలుగా ఏదిగాక రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, రాజిరెడ్డి , వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వనదుర్గా మాతను దర్శించుకున్న స్వామి వారు

**పాపన్నపేట్ జూలై 28 సిరి న్యూస్:**



ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారిని మంగళవారం రోజు శ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చేరుకున్న స్వామివారికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు, అనంతరం స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో... కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు శిక్షణ కార్యక్రమం.



**రామాయంపేట, జూలై 28 (సిరి న్యూస్)**

రాష్ట్రంలో మున్సిపల్ పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నాడు హైదరాబాద్ నగరంలో

ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన ఈ శిక్షణలో నాయకత్వ వికాసం, మున్సిపల్ పాలన, పట్టణాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, టౌన్ ప్లానింగ్ వంటి అంశాలపై సీనియర్ అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు పట్టణాభివృద్ధి పనులను సమర్థంగా అమలు చేసే విధానాలపై ఉపయోగకరమైన సూచనలు అందాయని పాల్గొన్న కౌన్సిలర్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఈ శిక్షణ దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు గుప్తా, దాకి శ్యామల స్వామి, బైరం స్వప్న కుమార్, రవి నాయక్, జంగంపల్లి శంకర్ గౌడ్, కొక్కు ప్రవీణ్, కోఆప్షన్ సభ్యులు చింతల రాధా భవాని యాదగిరి, మహమ్మద్ గౌస్, దేమే యాదగిరి, కాంగ్రెస్ నాయకులు చింతల యాదగిరి, బైరం కుమార్, దాకి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల ఈ కేవైసీ లో నిర్లక్ష్యం.. అధికారుల మౌనం..!

### ప్రజల ఇబ్బందులకు బాధ్యులెవరు?

**హత్నూర, జులై 28,(సిరి న్యూస్):**

రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది . ప్రభుత్వం ప్రతి అర్హులైన లబ్ధిదారుడు ఈ-కేవైసీ పూర్తి చేయాలని పదేపదే సూచనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ఆదేశాలు అమలు కావడం లేదు. దీనికి ప్రధాన కారణం హత్నూర మండలంలోని పలు గ్రామాల్లో కొందరు రేషన్ డీలర్ల నిర్లక్ష్య వైఖరేనని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులో కొత్తగా సభ్యులుగా చేరిన వారు, ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని వారు ప్రతిరోజూ రేషన్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నా, చాలా చోట్ల డీలర్లు సమయానికి దుకాణాలు తెరవడం లేదని, ప్రజలకు సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పేదలు పనులు మానుకుని పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే. ప్రభుత్వం ఈ-కేవైసీని తప్పనిసరి చేసినప్పుడు, దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ఎవరిది. ప్రజలదా? లేక రేషన్ డీలర్లదా? విధులు సక్రమంగా నిర్వహించని డీలర్లపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? పర్యవేక్షణ ఎక్కడ? బాధ్యత ఎవరిది? డీలర్ల వద్ద ఈ కేవైసీ చేసుకోలేని వారీ లిస్టు వచ్చిన లబ్ధిదారులకు సమాచారం ఇవ్వకుండా, ఈ కేవైసీ ఎక్కడైనా చేసుకోవచ్చు కానీ కొంతమంది డీలర్లు లబ్ధిదారులకు బెదిరింపులు. మీరు రేషన్ ఎక్కడ తీసుకుంటారో అక్కడనే మీ ఈ కేవైసీ చేసుకోండి. లబ్ధిదారులు ఈ కేవైసీ చేసుకోవడానికి డీలర్లకు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ గా చేసుకోవడం జరుగుతుందని, సమయం దగ్గర పడింది ఈ నెల జులై చివరి తేదీ 31 వరకే నని ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు. కొంతమంది డీలర్ల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అపోహలు పెరుగుతున్నాయి. చివరికి ఇబ్బందులు పడేది పేద కుటుంబాలే. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లోకి వెళ్లి రేషన్ దుకాణాలను తనిఖీ చేయాలి. సమయానికి దుకాణాలు తెరవని, ఈ-కేవైసీ ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రజలకు సేవలు అందించేందుకు పథకాలు ప్రవేశపెడితే, వాటిని అమలు చేసే బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉంటుంది. ఆ బాధ్యతను విస్మరించే వారికి మద్దతు లభిస్తే, ప్రజా పాలనపై విశ్వాసం దెబ్బతింటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హత్నూర మండలంలోని పలు గ్రామాల్లో, మండలంలోని రేషన్ దుకాణాల్లో ఈ-కేవైసీ ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజల ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. నిర్లక్ష్యానికి ముగింపు పలికి, బాధ్యతాయుతమైన సేవలు అందించాల్సిన అవసరం ఉంది.

## తెల్లాపూర్ డివిజన్ లో కలుషిత తాగునీటితో ప్రజల అవస్థలు..

- శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం
- దెబ్బతిన్నపైప్ లైన్లను వెంటనే మరమ్మతు చేయాలి
- బీఆర్ఎస్ యువ నాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్

**రామచంద్రపురం, జూలై 28 (సిరి న్యూస్):**



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తెల్లాపూర్ డివిజన్ లో కొల్లూరు, ఎదులనాగులపల్లి, మరియు 2బీహెచ్‌కే కాలనీతో పాటు పలు కాలనీల ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ యువ నాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్ల కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతుండటమే కాకుండా, నిర్ణీత సమయానికి తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల సంస్థ అధికారులు "ఇంకా తాగునీటి పైప్‌లైన్ల నిర్వహణను మాకు అధికారికంగా అప్పగించలేదు" అని చెబుతుండగా, మున్సిపల్ అధికారులు "బడ్జెట్ లేదు" అంటూ బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని ఆయన విమర్శించారు. శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలే నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లను అత్యవసరంగా మరమ్మతు చేయడంతో పాటు, ప్రతి కాలనీకి స్వచ్ఛమైన తాగునీటిని క్రమబద్ధంగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని సాయిచరణ్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యంతో నిర్లక్ష్యం చేయడం మానుకుని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు.

### జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో

## మరింత కృషి చేయాలని సూచన

- గుమ్మడిదల పీహెచ్ సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి
- ఆరోగ్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన డీఎంహెచ్ వో డాక్టర్ లలితాదేవి

**గుమ్మడిదల, జులై 28 (సిరి న్యూస్):**



సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ లలితాదేవి మంగళవారం గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, నిర్వహణ తీరు, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమగ్రంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఓపీ సేవలు, రోగుల నమోదు వివరాలు, సంబంధిత రికార్డులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన డీఎంహెచ్‌వో వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది స్పందన, మందుల లభ్యత వంటి అంశాలపై ఆరా తీశారు. గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న ప్రసూతి సేవలు, మాతా-శిశు సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. టీ-హబ్ ద్వారా నిర్వహిస్తున్న ప్రయోగశాల పరీక్షల పనితీరు, ఫలితాల అందజేత, ఓపీ సేవల నిర్వహణపై కూడా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య సేవలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యంగా, పూర్తిస్థాయిలో అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేసి, ప్రతి అర్హుడికి వాటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంగారెడ్డి జిల్లాను ఆరోగ్య సేవల అమలులో తెలంగాణ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రతి ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాతా-శిశు సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో నిలవడం వెనుక ఆరోగ్య శాఖ సిబ్బంది అంకితభావంతో చేసిన కృషే ప్రధాన కారణమని ఆమె ప్రశంసించారు. ఈ తనిఖీలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ మధుకర్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు





- రైతాంగానికి వ్యవసాయ విషయాల పట్ల స్పష్టమైన అవగాహన
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

**రామాయంపేట, జూలై 28 (సిరి న్యూస్)**

వ్యవసాయ సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాదు నుంచి, మంగళవారం మంత్రి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల్లోని మండలాల రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులతో రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, వ్యవసాయాన్ని సులభంగా, లాభసాటిగా మార్చేందుకు సాంకేతికతను వ్యవసాయ రంగానికి జోడించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యానవన పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగు వల్ల అధిక లాభాలు వస్తాయని వివరించారు. నేల స్వభావం, నీటి లభ్యత, దిగుబడి, మార్కెటింగ్ సౌకర్యం, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటలు సాగు చేయాలన్నారు. ప్రతి రైతు పంట మార్పిడి విధానాలు పాటించాలని పేర్కొన్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడరాదని తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రపంచ సమాచారాన్ని మొత్తం రైతు ముంగిట్లో ఉంచుతున్నామని అన్నారు. మున్ముందు రైతులు పెద్ద సంఖ్యలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతుల్లో పంటలకు సంబంధించి అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులంతా తప్పనిసరి ప్రతిరోజు రైతుల మధ్య ఉండాలని చెప్పారు. మంత్రితో నేరుగా, మండలాల నుంచి రైతువేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన పలువురు రైతులు మాట్లాడుతూ, వారు అవలంబించిన పంట మార్పిడి విధానాలు, పొందిన లబ్ధి వివరాలు పంచుకున్నారు. పలువురు ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు. రామాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, రైతు వేదికలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారని అన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ సంబంధ అనేక అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కలుగుతుందని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి పంటలు సాగుచేసుకోవాలని రైతులకు సూచించారు. జిల్లాలో కోతుల సమస్య నివారించేందుకు ప్రణాళికలు చేస్తున్నామని, కోతుల నివారణ కోసం జిల్లా అధికారులు ఆదిలాబాద్ జిల్లాను త్వరలో పర్యటిస్తారు అన్నారు. కోతుల నివారణకు అదిలాబాద్ జిల్లాలో అవలంబించిన పద్ధతులను అధ్యయనం చేసి మెదక్ జిల్లాలో ప్రతిష్టమైన ప్రణాళికతో కోతుల నివారణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి, వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ఉద్యానవన పంటల అధికారి ప్రతాప్ సింగ్, రామయంపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్, తాసిల్దార్ రజిని, ఎంపీడీవో షాజీలోద్దున్, మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్ దేవుని రంజిత్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ తో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై పశువులు.. ప్రజల గగ్గోలు

- రోడ్లపై పశువులు.. ప్రాణాలకు ముప్పు..
- ప్రమాదాల నివారణకు విద్యార్థి సంఘాల డిమాండ్..
- తక్షణ చర్యలకు మేయర్ కు వినతి..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 28 (సిరి న్యూస్)**



రోడ్లపై సంచరించే పశువులతో పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు నగరపాలక సంస్థ తక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రజల ప్రాణ భద్రతకు ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై మంగళవారం నగరపాలక సంస్థ మేయర్ ధరణి మధుకు వినతిపత్రం సమర్పించాయి. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీనివాస్, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చేరాల వంశీ మాట్లాడుతూ నగరంలో ముఖ్యంగా రాత్రి వేళల్లో పశువులను యజమానులు నిర్లక్ష్యంగా రహదారులపై వదిలేయడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అకస్మాత్తుగా పశువులు ఎదురుపడటంతో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురవుతూ గాయపడుతున్నారని, కొన్నిచోట్ల ప్రాణనష్టాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై పశువులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నగరంలో సంచరిస్తున్న పశువులను గుర్తించి ప్రత్యేక గోశాలలు లేదా నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా రోడ్డు ప్రమాదాల నివారణకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వెంటనే అమలు చేయాలని మేయర్ ధరణి మధును కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీనివాస్, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చేరాల వంశీ, సామాజిక కార్యకర్త రంటెంకి సుధాకర్ పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా

# వాల్దాస్ మల్లేష్ గౌడ్



**వెల్దుర్తి, జులై 28, (సిరి న్యూస్):**

భారతీయ జనతా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో మండల ప్రజా అభియాన్ లో భాగంగా ఈరోజు వెల్దుర్తి మండలంలో జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ పర్యటించారు. గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దుర్తి మండలంలో బి ఎల్ ఏ తోని సుమారుగా ఒక ఆరు నుండి ఏడుగురు బి ఎల్ ఓ లను కలిసి ఆ యొక్క బూత్ ను ఎన్నికల వెరిఫికేషన్,అదే విధంగా ఎస్ ఐ ఆర్ ఫారంను ఎలా పూర్తి చేశారు అని ఆ బూత్ లో ఉన్న ఓట్లు ఎన్ని అని దానిలో ఎన్ని ఓట్లు ఉన్నాయని, ఎన్ని ఓట్లు డిలీట్ అయినవని, ఎన్ని ఓట్లు మరణించిన వారివి ఉన్నవని , అదేవిధంగా డబల్ ఓట్లు ఎంతమందికి ఉన్నాయని బి ఎల్ ఓ లను ద్వారా తెలుసుకున్నారు. భారతీయ జనతా పార్టీ మండల నాయకులు అందరు కూడా మండల కేంద్రంలో పర్యటించారు. వెల్దుర్తి మండలం లో చూసినట్లయితే ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని చాలా పకడ్బందీగా బి ఎల్ వో లు నిర్వహిస్తున్నారని వారన్నారు. 18 సంవత్సరాల నిండిన వారి ఓట్లు కూడా నమోదు చేయాలని బి ఎల్ ఓ లకు తెలియజేయడం జరిగింది. వాళ్లు కూడా ప్రతి బూతులో కూడా కొత్తగా వచ్చిన యువకులఈ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ఎవరైతే నమోదు చేసుకుంటారో వారికి కొత్త ఓటు ఐడి కార్డు వస్తుందని ప్రతి ఓటర్లు దీనిని అశ్రద్ధ చేయకుండా ఫారం నింపి ఇవ్వాలని వారు తెలిపారు. ఇప్పుడు మనం నిర్లక్ష్యం చేసినట్లయితే మళ్లీ మనకు ఓటు రావడం కష్టమైతదని మనకు ఓటర్ ఐడి కార్డు కూడా లేటుగా వస్తది కాబట్టి మీరందరూ కూడా నమోదు చేసుకోవాలని చెప్తూ మన మండల స్థాయి బిజెపి నాయకులు అందరూ కూడా వచ్చే నెల మూడు తారీకు వరకు ఈ ఒక్క కార్యక్రమం ఉంటుంది కాబట్టి మండల స్థాయి నాయకులు అందరికీ కూడా బి ఎల్ ఓ ల దగ్గరికి వెళ్లి ఎక్కడైతే ఓటు నమోదు కాలేదు వెంటనే బిఎల్ఓ లను సంప్రదించి వారికి కావలసిన ఫారం ను నింపి ఆ యొక్క ఓటు పోకుండా జాగ్రత్త తీసుకోవాల్సిందిగా భారతీయ జనతా పార్టీ బిఎల్ఎ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్, మండల అధ్యక్షుడు పడిగే దాసు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రే వెంకటేశం, మాజీ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, యశ్వంతరావుపేట్ సర్పంచ్ మల్లేశం ఉపసర్పంచ్ నాయకులు నవీన్ పటేల్, యాదగిరి,పాల్గొన్నారు.

## మాతృ, శిశు మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

- గర్భిణులకు ప్రారంభ దశ నుంచే ఆరోగ్య పరీక్షలు
- హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, జూలై 28 (సిరి న్యూస్):**

జిల్లాలో ప్రసవాల సందర్భంగా మాతృ, శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటుచేసుకోకుండా అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశ నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను పూర్తిగా నివారించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇటీవల నమోదైన ప్రతి మాతృ, శిశు మరణ ఘటనను కేసు వారీగా కలెక్టర్ పరిశీలించారు. ఏ ఆసుపత్రిలో ఘటన చోటుచేసుకుంది, మరణానికి దారితీసిన కారణాలు ఏమిటి, వైద్య సేవలలో ఎక్కడైనా లోపాలు జరిగాయా అనే అంశాలపై సంబంధిత వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్య రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన నివారణ చర్యలను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. గర్భిణులను గర్భధారణ ప్రారంభం నుంచే నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించాలని, హై రిస్క్ ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి తక్షణమే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. గైనకాలజిస్టులు, వైద్యాధికారులు, ఏఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గర్భిణికి, ప్రతి నవజాత శిశువుకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఎంసీహెచ్) డాక్టర్ నాగలక్ష్మి , డాక్టర్ శశాంక్, సంబంధిత వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల పరిసర ప్రాంతంలో కుండపోత వర్షం

- రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది
- గంటపాటు కురిసిన భారీ వర్షంతో సస్యశ్యామలం కానున్న పంట పొలాలు
- వ్యవసాయ పనులకు ఊరట.. ప్రజలకు తాత్కాలిక ఇబ్బందులు




**గుమ్మడిదల, జులై 28 (సిరి న్యూస్):**

ఎన్నో రోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్న గుమ్మడిదల మండల రైతులకు ప్రకృతి వరం ప్రసాదించింది. మండల కేంద్రంలోని గుమ్మడిదలలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని దాదాపు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో ఎండలతో అల్లాడుతున్న నేలతల్లి దాహం తీరగా, రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇటీవల వర్షాభావ పరిస్థితులతో సాగు పనులు మందగించిన నేపథ్యంలో ఈ వర్షం రైతులకు కొత్త ఆశలను నింపింది. పంటల సాగుకు అవసరమైన తేమ లభించడంతో వ్యవసాయ పనులు వేగవంతం చేసుకునేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్న రైతులు కుండపోతగా కురిసిన వర్షాన్ని ఆనందంగా స్వాగతించారు. భారీ వర్షం కారణంగా ప్రధాన రహదారులపై కొంతసేపు నీరు నిలిచిపోగా, వాహనదారులు ప్రయాణాలు నిలిపివేయాల్సి వచ్చింది. అత్యవసర పనుల కోసం బయటకు వచ్చిన ప్రజలు సమీప దుకాణాలు, భవనాల్లో తలదాచుకుని వర్షం తగ్గిన తర్వాత తమ గమ్యస్థానాలకు వెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు కూడా తాత్కాలికంగా నిలిచిపోయాయి. అయితే వ్యవసాయ రంగానికి ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. పొలాల్లో తేమ పెరగడంతో దుక్కి దున్నడం, విత్తనాల విత్తకం, ఇతర వ్యవసాయ పనులను సులభంగా చేపట్టే అవకాశం లభించిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే తరహాలో వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో మండల వ్యాప్తంగా చల్లని వాతావరణం నెలకొనగా, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

# పేదరికాన్ని ఓడించిన పోరాటం... చిత్తాపూర్ కుర్రాడి సంచలనం!..

- బూట్లు లేకున్నా... గెలుపే లక్ష్యంగా అంజి పోరాటం..
- ఎండనైనా లెక్కచేయని పట్టుదల... జాతీయ స్థాయి రికార్డులు..
- నిరుపేద ఇంటి నుంచి కానిస్టేబుల్ కొలువు వరకు సంచలన ప్రయాణం..
- స్పోర్ట్స్ కోటాలో అఖిల భారత స్థాయి ఎంపిక..
- గ్రామం, స్నేహితులు, బంధువులు అంతా గర్వపడేలా అంజి సక్సెస్..









**చిర్యాల జిల్లా ప్రతినిధి జులై 28 (సిరి న్యూస్)**

క్రీడా ప్రపంచంలో మెరిసే ప్రతి నక్షత్రం వెనుక ఎన్నో కష్టాలు, త్యాగాలు దాగి ఉంటాయి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చే క్రీడాకారుల ప్రయాణం మరింత కఠినంగా ఉంటుంది. సరైన సామగ్రి లేక, పోషకాహారం అందక, టోర్నమెంట్లకు వెళ్లేందుకు డబ్బులు లేక ఎందరో ప్రతిభావంతులైన క్రీడాకారులు మధ్యలోనే తమ కలలను వదులుకుంటారు. కానీ కొందరు మాత్రం ఈ కష్టాలన్నింటినీ అధిగమించి, పట్టుదలతో ముందుకు సాగి చరిత్ర సృష్టిస్తారు. అలాంటి పోరాట పటిమకు నిదర్శనమే మంచిర్యాల జిల్లా, చిత్తాపూర్ గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు పల్ల అంజి కథ..

**నిరుపేద కుటుంబం నుండి మొదలైన పోరాటం..**

మంచిర్యాల జిల్లా, నిన్నల్ మండలం పరిధిలోని చిత్తాపూర్ గ్రామంలో వాలీబాల్ అంటే యువతలో ఒక ప్రత్యేకమైన ఉత్సాహం, జోష్ కనిపిస్తుంది. ఈ గ్రామం నుండి ఎదిగిన అసాధారణ ప్రతిభావంతుడైన క్రీడాకారుడు పల్ల అంజి. నిరుపేద కుటుంబంలో జన్మించిన అంజికి ఆట కోసం అవసరమైన కనీస సామగ్రి, బూట్లు కొనుక్కునే స్తోమత కూడా లేని పరిస్థితి. అయినా కూడా తన లక్ష్యం మీద ఉన్న దృఢ సంకల్పంతో ఎండనూ లెక్కచేయకుండా, కష్టాలను లెక్కచేయకుండా నిత్యం మైదానంలో సాధన చేశాడు..

**బాల్య స్నేహితుల మాటల్లో అంజి పోరాట పటిమ..**

అంజి చిన్ననాటి స్నేహితులు ఆయన గురించి గర్వంగా చెప్పుకుంటున్నారు. చిన్నప్పటి నుండి వాలీబాల్ అంటే అంజికి ప్రాణం అని, ఆడుకునే వయసులో కూడా అందరికంటే ముందుగా మైదానంలో అడుగు పెట్టేవాడని, ఆఖరున వెళ్లేవాడని స్నేహితులు గుర్తు చేసుకుంటున్నారు. సరైన బూట్లు, సామగ్రి లేకపోయినా ఎప్పుడూ ఆటలో వెనుకంజ వేయలేదని, ఎండలో మైదానం కాలిపోతున్నా అంజి మాత్రం సాధన మానేవాడు కాదని బాల్య స్నేహితులు చెబుతున్నారు. తమ మిత్రుడు ఈ స్థాయికి ఎదగడం చూసి తమకు చాలా గర్వంగా ఉందని, అతడి పట్టుదల తమకు కూడా స్ఫూర్తినిస్తుందని వారు అంటున్నారు..

**గ్రామస్తుల గొంతులో గర్వం..**

చిత్తాపూర్ గ్రామస్తులు అంజి విజయం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక చిన్న గ్రామం నుండి ఆర్థిక ఇబ్బందుల మధ్య కూడా జాతీయ స్థాయి వరకు ఎదగడం సామాన్య విషయం కాదని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. అంజి విజయం కేవలం అతడి ఒక్కడిదే కాదని, యావత్ చిత్తాపూర్ గ్రామానికే గర్వకారణమని పెద్దలు చెబుతున్నారు. అతడి కృషిని చూసి గ్రామంలోని మిగతా యువత కూడా క్రీడల పట్ల ఆసక్తి చూపిస్తున్నారని, అంజి ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలిచాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు..

**బంధువుల మాటల్లో కుటుంబ కష్టాలు, ఆనందం..**

అంజి బంధువులు కూడా అతడి ప్రయాణం గురించి మాట్లాడుతూ, కుటుంబం ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలను గుర్తు చేసుకుంటున్నారు. డబ్బులు లేక ఎన్నోసార్లు టోర్నమెంట్లకు వెళ్లడం కూడా కష్టంగా మారిన సందర్భాలున్నాయని, అయినప్పటికీ అంజి ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదని బంధువులు చెబుతున్నారు. కుటుంబం అంతా కలిసి అతడికి చేతనైనంత సహకారం అందించిందని, ఇప్పుడు అతడు సాధించిన విజయం చూసి కుటుంబం మొత్తం ఆనందంతో ఉప్పొంగిపోతోందని వారు తెలిపారు..

**జాతీయ స్థాయిలో సత్తా చాటిన ప్రతిభ..**

పల్ల అంజి ఆట పట్ల చూపిన అంకితభావం అతడిని ఎన్నో జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్లింది. సీనియర్ జాతీయ పోటీలు, జూనియర్ జాతీయ పోటీలు, యువజన జాతీయ పోటీలు, అలాగే 19 సంవత్సరాల లోపు వారి జాతీయ పోటీలలో అంజి పాల్గొని తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఈ తరహా విజయాలు సాధించడం సాధారణ విషయం కాదు, ప్రత్యేకించి ఆర్థిక ఇబ్బందుల మధ్య ఆడే క్రీడాకారులకు ఇది మరింత కష్టతరమైన ప్రయాణం. అయినా అంజి తన పట్టుదలతో ఈ అడ్డంకులన్నింటినీ అధిగమించి రాష్ట్రంలో వాలీబాల్ ఆడే క్రీడాకారులకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు..

**కష్టానికి తగిన ప్రతిఫలం..ప్రభుత్వ ఉద్యోగం..**

ఇన్నేళ్ల కృషికి, త్యాగానికి తగిన ఫలితం చివరకు అంజికి దక్కింది. ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో అంజి పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఇది మాత్రమే కాకుండా, క్రీడా కోటా ద్వారా అఖిల భారత క్రీడా కోటాలో కూడా ఎంపికయ్యాడు. ఒక నిరుపేద కుటుంబం నుండి వచ్చిన యువకుడు, తన కృషితో, పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అనేది గ్రామంలోని యువతకు గొప్ప స్ఫూర్తిని ఇచ్చే విషయం..



**తల్లిదండ్రుల ఆనందం..**

నిరుపేద కుటుంబంలో పుట్టి, ఇన్ని కష్టాలను అధిగమించి తమ గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన తమ కుమారుడిని చూసి అంజి తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా, తమ బిడ్డ కల నెరవేర్చుకునేందుకు వారు అందించిన ప్రోత్సాహం కూడా ఈ విజయం వెనుక ఎంతో ప్రాధాన్యత కలిగినదిగా చెప్పవచ్చు..

**విద్యాభ్యాసం..**

క్రీడల్లోనే కాకుండా విద్యాభ్యాసంలో కూడా అంజి తనదైన ముద్ర వేసుకున్నాడు. పదవ తరగతి వరకు అదిలాబాద్ లోని టిటి.డబ్ల్యూ.ఆర్.ఎస్ ( గురుకుల పాఠశాల )లో చదివాడు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యను మంచిర్యాల ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశాడు. చదువు, క్రీడలు రెండింటినీ సమన్వయం చేసుకుంటూ అంజి సాధించిన విజయం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుంది..

**కష్టపడితే ఫలితం..**

నిరుపేద నేపథ్యం నుండి వచ్చి, కష్టాలను లెక్కచేయకుండా, ఎండను సైతం లెక్కచేయకుండా నిరంతర సాధన చేసి జాతీయ స్థాయిలో రాణించి, చివరకు ప్రభుత్వ ఉద్యోగం సాధించిన పల్ల అంజి కథ నేటి యువతకు నిజమైన స్ఫూర్తిదాయక పాఠం. గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అంతా అభినందిస్తున్న ఈ విజయగాథ చిత్తాపూర్ గ్రామం గర్వించదగ్గ అంశంగా నిలిచింది. కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుందని నిరూపించిన అంజి జీవితం ఎందరికో దారి చూపే వెలుగుదివ్వెగా మారింది.

# విద్యాబాలన్ వెయిట్ లాస్ స్టోరీ

బాలీవుడ్ బ్యూటీ విద్యాబాలన్ బరువు తగ్గి స్లిమ్‌గా కనిపిస్తోంది ఇప్పుడు. తను బరువు తగ్గి, నాజూగ్గా అవ్వడానికి వెనకున్న రహస్యం ఏంటో ఓ సందర్భంలో బయటపెట్టింది. అదేంటంటే...



"నా జీవితంలో బరువు విషయంలో ఎన్నో అనుభవాలున్నాయి. గతంలో హార్మోన్ల సమస్య కారణంగా బరువు పెరిగా. ఈ క్రమంలో చాలామంది నన్ను విమర్శిస్తుంటే నేనూ నా శరీరాన్ని అసహ్యించుకునేదాన్ని. ఒక్కోసారి కోపం, చిరాకు వచ్చేవి. నాజూగ్గా మారి నన్ను నేను నిరూపించుకోవాలని నా శరీరాన్ని ఇబ్బంది పెట్టిన రోజులు కూడా ఉన్నాయి. కానీ ఇది కరెక్ట్ కాదని రియలైజ్ అయ్యా. అప్పట్నించి బరువు పెరిగినా.. తగ్గినా.. ఎలా ఉన్నా.. నన్ను నేను యాక్సెప్ట్ చేయడం మొదలుపెట్టా. దాంతో నా శరీరంపై నాకు ఇష్టం పెరిగింది. తగ్గాలనిపించినప్పుడు తగ్గుతున్నా. నేను ఎక్కువగా ఇంట్లో వండిన ఆహారమే తీసుకుంటా. గ్లూటెన్ ఫుడ్స్‌కి దూరంగా ఉంటా. ఏది తీసుకున్నా పచ్చివి మాత్రం అస్సలు తీసుకోను. ఇలా పచ్చి ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరాకృతిని మెయింటెయిన్ చేయడం సాధ్యమవుతుంద"ని చెప్పింది విద్యాబాలన్.

### నో రా (no raw) డైట్ అంటే..

ఈ డైట్‌లో పచ్చివి తీసుకోకూడదు. కాయగూరలు, మాంసం వంటి రోజువారీ తీసుకునే ఆహార పదార్థాలేవైనా.. ఉడికించడం లేదంటే ఇతర పద్ధతుల్లో వండుకొని తీసుకోవడం వల్ల వీటిలోని పోషకాలు శరీరానికి అందుతాయి. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడి సులభంగా జీర్ణమవుతుంది అంటున్నారు నిపుణులు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు ఈ ఆహార నియమాలు పాటించడం మంచిది అంటున్నారు. కొన్ని రకాల పచ్చి ఆహార పదార్థాల్ని తీసుకోకపోవడం వల్ల ఆరోగ్యానికి కూడా ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు నిపుణులు. అవేంటంటే..







- ముఖ్యంగా మాంసం, గుడ్లు, పాశ్చరైజేషన్ చేయని పాలుపాల పదార్థాల్లో ఈ కొలై, సాల్మొనెల్లా.. వంటి హానికారక బ్యాక్టీరియా ఉంటుంది. సరైన ఉష్ణోగ్రత వద్ద వీటిని ఉడికిస్తే ఆహారం ద్వారా సంక్రమించే వ్యాధులకు దూరంగా ఉండొచ్చట.
- ఉడికించడం వల్ల... ఆహార పదార్థాల్లో ఉండే సంక్లిష్టమైన ప్రొటీన్, ఫైబర్.. వంటి పోషకాలు విచ్ఛిన్నమవుతాయి. ఫలితంగా ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్, కడుపుబ్బరం.. వంటి సమస్యలున్న వాళ్లు ఇలా ఉడికించుకొని తీసుకోవాలి.
- ఉడికించిన తర్వాతే యాంటీ ఆక్సిడెంట్లు, బీటాకెరోటిన్.. వంటి పోషకాల్ని శరీరం త్వరగా గ్రహిస్తుంది. కాబట్టి ఇవి ఎక్కువగా ఉండే టొమాటో, క్యారట్.. వంటివి ఉడికించుకొని తీసుకోవడం మంచిది.
- అయితే 'No Raw' డైట్ వల్ల ఆరోగ్యానికి పలు ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని పదార్థాల్ని ఉడికించడం వల్ల వాటిలోని పోషకాలు నశించే అవకాశమూ ఉందంటున్నారు నిపుణులు. అందుకే ఆ పోషకాలు తరిగిపోకుండా వండుకోవాలంటున్నారు.
- అలాగే కొంతమంది పచ్చి కాయగూరల్ని నీటిలో ఉడికిస్తుంటారు. దీనివల్ల 'బి', 'సి'.. వంటి నీటిలో కరిగే విటమిన్లు నశించిపోతాయి. కాబట్టి ఇలాంటి కుకింగ్ పద్ధతులకు దూరంగా ఉండడం బెటర్. అందుకే.. స్టీమ్ మీద ఉడికించడం, తక్కువ నూనెలో వేగించడం వంటి పద్ధతులు ఫాలో అవ్వాలి. అయితే, డ్రైఫ్రూట్స్, పండ్లు, పండ్ల రసాలు, మొలకెత్తిన గింజలు, నట్స్, విత్తనాలు.. వంటివి పచ్చిగానే తీసుకోవాలి.



చిన్ని ముఖం, బోసి నవ్వులు.. చూస్తుంటే మనసుకు ఎంతో హాయి కలుగుతుంది ఎవరికైనా. అలాంటిది బిడ్డను కన్న తల్లికి ఎంత ఆనందంగా ఉంటుంది.. 'అమ్మా' అనే పిలుపు కోసం పరితపిస్తుంటుంది తల్లి మనసు. తాను చెప్పే కథలన్నీ వింటూ ఊ.. కొట్టాలని కోరుకుంటుంది. అమ్మని తేరిపారా చూస్తుంటే.. తల్లి మనసు ఆనందంతో ఉప్పొంగిపోతుంది. కానీ... ఇవేవీ అనుభూతి చెందకుండా ఉండడం ఓ తల్లికి సాధ్యమయ్యే పనికాదు.అలాంటిది తన పాపకి అమ్మా అని పిలవలేదని, తన మాటలు బిడ్డకు వినపడడం లేదని.. అంతెందుకు.. అసలు ఆ బిడ్డ కళ్లకు తల్లి కనిపించట్లేదని తెలిస్తే.. ఆ తల్లి మనసు తట్టుకుంటుందా? ఇలాంటి ప్రత్యేక అవసరాలున్న పిల్లల తల్లుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడానికి కూడా కష్టంగానే ఉంటుంది. అలాంటి పరిస్థితిని ఎదుర్కొని, తన బిడ్డలాంటి అనేకమంది పిల్లల కోసం 'మారిపోసా ఫౌండేషన్ సెంటర్' స్థాపించింది సేజల్. ఇదే ఆమె విజయగాథ.

# ఆ ఆలోచనే నన్ను మార్చింది

సక్సెస్ స్టోరీ

తన కడుపులో కవలలు పెరుగుతున్నారని తెలిసి ఎంతో సంతోషించింది సేజల్. అయితే, ప్రెగ్నెన్సీలో కొన్ని సమస్యల వల్ల నెలలు నిండకుండానే డెలివరీ అయింది. ఇద్దరిలో ఒక్కరే మిగిలారు. తనూ బతకడం కష్టమేనన్నారు డాక్టర్లు. నెలలపాటూ ఐసీయూలోనే ఉంచాల్సి వచ్చింది. వందరోజుల చికిత్స తర్వాత తమ బిడ్డ విహాను వాళ్ల చేతుల్లో పెట్టారు. ఆ సంతోషం ఎంతోసేపు నిలువలేదు ఆ తల్లిదండ్రులకు. వైద్యులు చెప్పిన మాట విని నిర్ఘాంతపోయారు. 'ఆక్సిజన్ ఎక్కువై తనకు రెటినాల్ డిటాచ్‌మెంట్ అయిందనీ, ఇకపై చూడలేద'ని చెప్పారు. తను పెరిగేకొద్దీ దృష్టిలోపంతోపాటు మానసిక ఎదుగుదలలోనూ లోపాలు ఉన్నాయని తెలిసింది. సొంత పనులు చేసుకోవడం కూడా చాలా కష్టమని వాళ్లకు అర్థమయింది.



### మారిపోసా ఫౌండేషన్ సెంటర్

విహాకు ఐదారేళ్లప్పుడు హెలెన్ కెల్లర్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించారు. తొమ్మిదేళ్లు వచ్చాక తను మాటలు నేర్చుకోవడం కోసం వోకల్ ట్రైనింగ్ అవసరమని వేరే చోటుకి తీసుకెళ్లమని అక్కడివాళ్లు చెప్పారు. దక్షిణ బాంబే అంతా తిరిగినా, విహాకు సరిపోయే శిక్షణా కేంద్రం ఒక్కటీ కనిపించలేదు. ఎందుకంటే తనకు మల్టిపుల్ డిజేబిలిటీస్ ఉన్నాయి. ఇటువంటి పిల్లలకు రోజువారీ పనులు నేర్పించాల్సి ఉంటుంది. తినటం దగ్గరనుంచీ బట్టలువేసుకోవడం, మోటార్ స్కిల్స్, వంటివి అనేకం నేర్పించాలి. ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ కూడా అవసరమవుతుంది. వీళ్లలో జ్ఞానేంద్రియాల సమన్వయం ఉండదు. అందుకు వారికి సెన్సరీ స్టిమ్యులేషన్ ఇవ్వాలి. ఆర్ట్, సంగీతం వంటి వాటిలోనూ భాగం చేయాల్సి ఉంటుంది. అప్పుడే సేజల్ ఒక నిర్ణయానికి వచ్చింది. విహా లాంటి ప్రత్యేక అవసరాలున్న పిల్లలకోసం తనే ఒక కేంద్రాన్ని నెలకొల్పాలని నిర్ణయించుకుంది. అలా వచ్చిందే 'మారిపోసా ఫౌండేషన్ సెంటర్'. ప్రస్తుతం ఇందులో 14మంది పిల్లలున్నారు. మారిపోసా ప్రారంభించాక అక్కడికి వచ్చిన పిల్లల్ని చూస్తోంది. ఒక్కొక్కరికీ ఒక్కో సమస్య. వాళ్ల అవసరాలను బట్టి, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్ని రూపొందించడం కోసం పరిశోధనలూ చేస్తోంది.

### ఇప్పుడు నా కోరిక అదే

మొదట్లో విహా చూడడం, నవ్వడం లాంటివి ఏమీ చేసేది కాదు. కానీ తర్వాత విహా పలికిన మొదటి మాట 'పాపా'.. ఆ మాట విన్నప్పుడు సేజల్ చాలా సంతోషించానని చెప్పింది. "ఏదో ఒకరోజు తను నా దగ్గరికొచ్చి అందరి పిల్లల్లానే నాతో మాట్లాడుతుందనీ, నడవడం, పరిగెత్తడం... వంటివి చేస్తుందని ప్రతిరోజూ అనుకుంటా. కానీ ఇప్పుడు నా కోరిక ఒక్కటే. తను ఎలా ఉన్నా... జీవితాంతం సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటే చాలు. అయితే, ఒక్కోసారి ఆ బిడ్డకు అమ్మగా నన్ను ఎప్పుడూ వెంటాడే భయం ఒక్కటే. ఒకవేళ దురదృష్టవశాత్తూ నేను ఈ లోకంలో లేకపోతే, తనను ఎవరు చూసుకుంటారనే ప్రశ్నే నన్ను బలహీనురాల్ని చేసేది. అప్పుడే నేనో విషయం తెలుసుకున్నా. నేను ఎంతగా ఆలోచించినా, బాధపడినా లాభం లేదని సర్ధిచెప్పుకొంటా. ప్రస్తుతం ఉన్న క్షణాల్ని ఆనందంగా మలుచుకోవడమే తప్ప మనచేతుల్లో ఏమీ ఉండదు. ఇప్పుడు జీవితం నాకు విహాతోపాటు అనేకమంది పిల్లలకు తల్లిగా మారే అవకాశాన్నీ ఇచ్చింది. అది చాలు.. వాళ్లకు ప్రేమను పంచుతూ తృప్తిగా గడిపేస్తా" అంటోంది సేజల్.

# ఆ నొప్పులకు ఈ ఆసనాలు

యోగాతో మనసుకు, శరీరానికీ ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఒక్కో ఆసనం ఒక్కో విధంగా పనిచేస్తుంది. అయితే, ముఖ్యంగా ఆడవాళ్ల సమస్యలకు అద్భుతంగా పనిచేసే వాటిలో విపరీత కరణి ఆసనం ఒకటి. మరి దానివల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.



విపరీత కరణి ఆసనం రోజూ సాధన చేయడం వల్ల తలనొప్పి తగ్గుతుంది. శరీరాన్ని యాక్టివ్‌గా ఉంటుంది. ఈ ఆసనం వల్ల కటి వలయ కండరాలకు, ప్రత్యుత్పత్తి వ్యవస్థకు రక్తప్రసరణ సాఫీగా ఉంటుంది. తద్వారా ప్రత్యుత్పత్తి సమస్యలు రాకుండా జాగ్రత్తపడొచ్చు. ప్రత్యుత్పత్తి వ్యవస్థకు రక్తప్రసరణ బాగా జరిగి నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది ఈ ఆసనం. నడుం కింది భాగంలో నొప్పి కొంతమంది మహిళల్ని ఇబ్బంది పెడుతుంటుంది. ఇలాంటి వారు రోజూ 5-20 నిమిషాల పాటు విపరీత కరణి ఆసనం సాధన చేస్తే కొన్ని రోజుల్లోనే నొప్పి నుంచి ఉపశమనం పొందొచ్చు అంటున్నారు నిపుణులు. ఈ ఆసనం వేసినప్పుడు శరీరానికి వ్యతిరేక దిశలో ఒత్తిడి తగలడం వల్ల థైరాయిడ్ గ్రంథికి రక్తప్రసరణ చక్కగా అందుతుంది. ఫలితంగా హైపో/హైపర్ థైరాయిడ్ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. అయితే ఎవరైనా సరే దీనిని సాధన చేసేముందు ఒకసారి నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.